
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
సంగారెడ్డి 5 మెదక్
శుక్రవారం 10 అక్టోబరు 2025
జిల్లాల వార్తలు



జ'హీరా'బాద్
పారిశ్రామిక కారిడార్‌గా వెలుగు
నిమ్జ్, స్మార్ట్ సిటీ సహా పలు పరిశ్రమలు
పెరగనున్న ఉద్యోగ, ఉపాధి అవకాశాలు
ఆకాశాన్నంటిన భూముల ధరలు
7

సాంకేతిక శిక్షణతో ఉపాధి అవకాశాలు

సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య

హత్నూర, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాన్ని పెంపొందించుకుంటే ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవచ్చని సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య పేర్కొన్నారు. హత్నూర ఏటీసీ సెంటర్‌ను గురువారం ఆమె పరిశీలించారు. విద్యార్థులకు ఇస్తున్న శిక్షణ, సౌకర్యాలు, అవసరాలపై సమీక్ష నిర్వహించారు. సమకాలీన అవసరాలకు తగినట్లు విద్యార్థులకు మెరుగైన శిక్షణ ఇవ్వాలని సూచించారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. వార్డులు, మందుల నిల్వలను పరిశీలించారు. రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. సిబ్బంది సమయపాలన పాటించాలని స్పష్టం చేశారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ ఫర్హీన్‌షేక్, ఎంపీడీవో శంకర్, పీహెచ్‌సీ వైద్యాధికారి రజిని, ఐటీఐ ప్రిన్సిపాల్ సుబ్బలక్ష్మి తదితరులు ఉన్నారు.



హత్నూరలోని ఏటీసీ సెంటర్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థులతో మాట్లాడుతున్న సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య

సంగారెడ్డి నియోజకవర్గ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించిన

టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

సంగారెడ్డి టౌన్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): రానున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో అభ్యర్థుల ఖరారుపై నియోజకవర్గ కన్వీనర్ అంజనేయులు, సదాశివపేట బ్లాక్ ప్రెసిడెంట్ రామ్‌రెడ్డి, సంగారెడ్డి బ్లాక్ ప్రెసిడెంట్ రఘుగౌడ్, ఆత్మ కమిటీ చైర్మన్ ప్రభు, మండల అధ్యక్షులతో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి.జగ్గారెడ్డి గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ సోమవారం కాంగ్రెస్ తరఫున ఎంపీటీసీ, జడ్పీటీసీ అభ్యర్థులు నామినేషన్ వేసేలా చూడాలని తెలిపారు ఆదివారం వెంకటేశ్వర గార్డెన్స్ మల్కాపూర్‌లో కార్యకర్తలు సమావేశంలో ఎంపీటీసీ జడ్పీటీసీ అభ్యర్థులను ప్రకటిస్తానని జగ్గారెడ్డి తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోవాలని అన్నారు.



సంగారెడ్డి నియోజకవర్గ ముఖ్య నాయకులతో సమావేశమైన జగ్గారెడ్డి



పల్స్ పోలియోకు సర్వం సిద్ధం

ఈ నెల 12 నుంచి 14 వరకు చుక్కల మందు పంపిణీ

సంగారెడ్డి జిల్లాలో ఐదేళ్ల లోపు చిన్నారులు 1,91,668

జిల్లావ్యాప్తంగా 1,137 బూత్‌ల ఏర్పాటు

సంగారెడ్డి అర్బన్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 12 నుంచి 14 వరకు పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను పూర్తిచేసింది. రాష్ట్రవ్యాప్తంగా కేవలం జిల్లాల్లోనే పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహిస్తుండగా, ఇందులో సంగారెడ్డి జిల్లా కూడా ఉన్నది. సంగారెడ్డి జిల్లాలో ఐదేళ్ల లోపు చిన్నారులు 1,91,668 మంది ఉన్నారు. వీరందరికీ పల్స్ పోలియో చుక్కల మందు పంపిణీ చేయడానికి 1,137 బూత్‌లను ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో గ్రామీణ ప్రాంతాల్లో 907, పట్టణ ప్రాంతాల్లో 230 బూత్‌లు ఏర్పాటు చేయనున్నారు. అదనంగా 38 మొబైల్ బూత్‌లను కూడా ఏర్పాటు చేస్తున్నారు. 12వ తేదీన పోలియో చుక్కల మందు వేసుకోనివారికి 13, 14 తేదీల్లో ఇంటికి వచ్చి వేస్తారు. పల్స్ పోలియో నిర్వహణకు 4,548 మంది వ్యాక్సినేటర్లు, 1,583 మంది ఆరోగ్య సిబ్బంది, 1,505 మంది అంగన్‌వాడీ సిబ్బంది. 904 మంది ఆశాలు, 596 మంది వలంటీర్లను నియమించారు.

పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలి



జిల్లాలో ఐదేళ్ల లోపు పిల్లలందరికీ తల్లిదండ్రులు కచ్చితంగా పోలియో చుక్కల మందు వేయించాలి. పిల్లల భవిష్యత్తు కోసం, పోలియో రహిత సమాజ నిర్మాణం కోసం సహకరించాలి. జిల్లాలో పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతం చేయడానికి అన్ని ఏర్పాట్లు చేశాం.

-నాగనిర్మల, డీఎంహెచ్‌వో, సంగారెడ్డి

సంగ్రామం.. విరామం

స్థానిక ఎన్నికలకు బ్రేక్

- సర్వం సిద్ధం చేసిన అధికారులు
- హైకోర్టు తీర్పు వచ్చేదాకా హడావిడి
- నోటిఫికేషన్ విడుదలైన కాసేపటికే స్టే


స్థానిక సంస్థల ఎన్నికలు ఊరించి ఊసురుమనిపించాయి. రిజర్వేషన్లపై హైకోర్టు నాలుగు వారాల గడువు విధించింది. దీంతో గురువారం ఉదయమే విడుదలైన నోటిఫికేషన్‌కు ఇదే రోజు సాయంత్రం బ్రేక్ పడినట్లయ్యింది. ఉదయం నుంచి సాయంత్రం దాకా ఆయా జిల్లాల అధికారులు పూర్తి అప్రమత్తతతో వ్యవహరించారు. నామినేషన్ స్వీకరణ కేంద్రాలను తనిఖీ చేశారు. ఎన్నికల బృందాలను నియమించారు. అధికారులు చేసిన హడావిడితో ఆశావహులు సైతం ఎన్నికలపై ఆశలు పెట్టుకున్నారు. కానీ, నామినేషన్లు వేయడానికి ఇంకా రెండు రోజుల సమయం ఉండటంతో నామినేషన్ పత్రాలను మాత్రమే తీసుకెళ్లారు. చివరకు ఆశలు అడియాశలయ్యాయి.

సంగారెడ్డి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : సంగారెడ్డి జిల్లాలో తొలి విడతగా 12 జడ్పీటీసీ, 129 ఎంపీటీసీ స్థానాలు, మెదక్ జిల్లాలో 10 జడ్పీటీసీ, 99 ఎంపీటీసీ స్థానాలు, సిద్దిపేట జిల్లాలో 15 జడ్పీటీసీ, 125 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించేందుకు నోటిఫికేషన్ వెలువరించారు. దీంతో అన్ని మండల పరిషత్ కార్యాలయాల వద్ద గురువారం సందడి నెలకొంది. రిటర్నింగ్ అధికారులు ఆశీనులై నామినేషన్ పత్రాలను అందజేయడం, స్వీకరించడంలో నిమగ్నమయ్యారు.

10 నామినేషన్లే దాఖలు

సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాల ఎంపీటీసీ స్థానానికి తుపాకుల మురళి గురువారం నామినేషన్ దాఖలు చేశారు. అదే విధంగా చిన్నకోడూరు మండల జడ్పీటీసీ స్థానానికి బంక చిరంజీవి, అంకార్ మధు, పల్లె రాజు, అరకాల శ్రీకాంత్, నారాయణరావుపేట జడ్పీటీసీ స్థానానికి బర్మ రాంచంద్రం, గౌటి స్వామి, నిరుగొండ దేవయ్యలు నామినేషన్ సమర్పించారు. సంగారెడ్డి జిల్లా కంగ్టి జడ్పీటీసీ అభ్యర్థిగా అంబటి శ్రీకాంత్‌రెడ్డి, బోర్గి ఎంపీటీసీ స్థానానికి చంద్రవ్వ నామినేషన్ వేశారు. మెదక్ జిల్లాలో ఒక్కరు కూడా నామినేషన్ దాఖలు చేయలేదు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 37 జడ్పీటీసీ స్థానాలు, సుమారు 350 ఎంపీటీసీ స్థానాలకు నోటిఫికేషన్ విడుదలైనా తొలిరోజు నామినేషన్ వేసేందుకు ఎవరూ సాహసించలేదు. హైకోర్టు తీర్పు నేపథ్యంలో చాలామంది తర్జనభర్జన పడ్డారు. రిజర్వేషన్లపై ఎటూ తేలకపోవడంతో ముందుగా నామినేషన్లు వేసి

మిగతా 7వ పేజీలో





హవేళిఘణపూర్‌లో నామినేషన్ పత్రాలను పరిశీలిస్తున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ జిల్లాలో ఓటర్లు

5,23,327

పురుషులు 2,51,532,

మహిళలు 2,71,787 మంది

21 జడ్పీటీసీ, 190 ఎంపిటీసీ స్థానాలు

తొలి విడతల్లో 10 మండలాల ఎంపిక

హవేళిఘనపూర్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల్లో 5,23,327 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారని కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. వీరిలో 2,51,532 మంది పురుషులు, 2,71,787 మంది మహిళా ఓటర్లున్నారని ఆయన తెలిపారు. హవేళిఘణపూర్‌లో స్థానిక సంస్థల ఎన్నికల నామినామినేషన్ కేంద్రాన్ని ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో 21 జడ్పీటీసీలు, 190 ఎంపీటీసీ స్థానాలున్నాయని పేర్కొన్నారు. తొలి విడతలో 10 మండలాల్లో ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు తెలిపారు.

సర్కారు పాఠశాలలను ప్రాథమిక స్థాయి నుంచి బలోపేతం చేయడంపై ప్రభుత్వం దృష్టిసారించింది. 2025-26 విద్యా సంవత్సరంలో ఎంపిక చేసిన ప్రాథమిక పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక (ప్రీ ప్రైమరీ) తరగతులు ప్రారంభించేందుకు అనుమతిస్తూ నాలుగు నెలల క్రితం పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా సంగారెడ్డి జిల్లాలో 60 పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ తరగతుల ప్రారంభానికి అధికారులు చర్యలు చేపట్టారు. ఎంపిక చేసిన ప్రీ ప్రైమరీ బడుల్లో సిబ్బంది నియామకానికి నోటిఫికేషన్ సైతం జారీ చేశారు.



సంగారెడ్డి మండలం పోతిరెడ్డిపల్లి పాఠశాలలో ప్రీ ప్రైమరీ తరగతి గదిపై ఆకట్టుకునే చిత్రాలు

'ప్రీ ప్రైమరీ'కి సిద్ధం

సంగారెడ్డి జిల్లాలో 60 పాఠశాలల్లో ఏర్పాట్లు

సర్కారు బడుల్లో ప్రత్యేకంగా తరగతి గది అలంకరణ

కొనసాగుతున్న సిబ్బంది నియామక ప్రక్రియ

సంగారెడ్డి అర్బన్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బడుల్లో ఏర్పాటు చేయనున్న పూర్వ ప్రాథమిక తరగతుల నిర్వహణను వివిధ శాఖలతో సమన్వయం చేయనున్నారు. పాఠశాల విద్యాశాఖ, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ, వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖలకు ప్రత్యేక బాధ్యతలు అప్పగించారు. మండలస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు మూడు శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయనున్నాయి. ఈసారి ప్రీ ప్రైమరీలో చేరిన విద్యార్థులను వచ్చే ఏడాది (2026-27)లో మొదటి తరగతిలో చేరేలా కనీస అభ్యసన సామర్థ్యాలతో పాటు సంసిద్ధతా కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

చిన్నారులు ఆకట్టుకునేలా తరగతి అలంకరణ

ఇలా ఉండగా ఎంపిక చేసిన ప్రాథమిక పాఠశాలల్లో ఒక గదిని ప్రత్యేకంగా ప్రీ ప్రైమరీ తరగతుల నిర్వహణ కోసం కేటాయించారు. చిన్నారులు ఆకట్టుకునేలా ఆ గదిని ఆధునీకరించారు. అక్షరాలు, బొమ్మలతో గోడలను తీర్చిదిద్ది చిన్నారులను ఆకట్టుకునేలా గదిని మార్చారు. చిన్నారులకు అవసరమైన ఫర్నీచర్ సమకూర్చేందుకు టెండరు దాఖలు చేశారు.

రెండు నెలల్లో తరగతులు

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ తరగతుల ప్రారంభానికి చర్యలు తీసుకుంటున్నాం. జిల్లా వ్యాప్తంగా ఎంపిక చేసిన బడుల్లో ప్రీ ప్రైమరీ తరగుతులు రెండు నెలల్లో ప్రారంభిస్తాం. ప్రీ ప్రైమరీ బడుల్లోని ప్రత్యేక గదికి ఆకట్టుకునేలా ఆధునీకరణ పనులు కొనసాగుతున్నాయి. తాత్కాలిక టీచర్, ఆయా నియామక ప్రక్రియ తుది దశలో ఉన్నది. ఈ విద్యా సంవత్సరం నుంచే ప్రీ ప్రైమరీ ఎడ్యుకేషన్ ప్రారంభానికి పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నాం. ఎంపిక చేసిన పాఠశాలల్లో ప్రవేశాల కల్పనపై దృష్టి సారించాం.

-ఎస్. వెంకటేశ్వర్లు, డీఈవో, సంగారెడ్డి



పోతిరెడ్డిపల్లి పాఠశాలలో సిద్ధం చేసిన ప్రీ ప్రైమరీ తరగతి గది

షాపింగ్ పేరిట

సైబర్ మోసం

రూ.5.88 లక్షలు గల్లంతు

నర్సాపూర్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): అమెజాన్ షాపింగ్ ప్లాట్‌ఫాం పేరిట సైబర్ నేరగాళ్లు ఓ వ్యాపారికి కుచ్చుటోపీ వేశారు. సెల్‌ఫోన్‌లో వచ్చిన మెసేజ్ ఆధారంగా అమెజాన్ షాపింగ్ యాప్ అనుకుని వస్తువులు కొనుగోలు చేయడానికి ప్రయత్నించిన వ్యాపారి రూ. 5.88 లక్షలు పోగొట్టుకున్నాడు. మెదక్ జిల్లా నర్సాపూర్‌కు చెందిన విశ్వనాథ్ సెల్‌ఫోన్‌కు ఇటీవల ఓ మెసేజ్ వచ్చింది. అమెజాన్ ఆన్‌లైన్ షాపింగ్ పోర్టల్ వలే కనిపించిన ఈ సైట్‌లో ఆన్‌లైన్‌లో వస్తువులు ఆకర్షణీయంగా కనిపించడంతో వస్తువులు కొనుగోలు చేసేందుకు ప్రయత్నించాడు. తన భార్య పేరిట ఉన్న క్రెడిట్ కార్డుతో చెల్లింపులు చేసేందుకు ప్రయత్నిస్తున్న క్రమంలో అవతలి వ్యక్తి లైన్‌లోకి వచ్చి ఓటీపీ చెప్పాలని అడిగాడు. అనుమానం వచ్చి పోర్టల్ మూసివేసే ప్రయత్నం చేసినా క్రెడిట్ కార్డు నుంచి రూ.5.88 లక్షలు మాయమయ్యాయి. ఈమేరకు బాధితుడు గురువారం సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదుపై దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రంజిత్‌కుమార్ తెలిపారు.

సర్పంచ్‌గా పోటీ చేస్తే
బాండ్ పేపర్ రాసివ్వాలి
నంగునూరు యువత వినూత్న డిమాండ్
సోషల్ మీడియాలో వైరల్
7

చిక్కిన
బాలుడి ఆచూకీ
బంధువులే తీసుకెళ్లారు..
తల్లికి అప్పగించిన పోలీసులు
6

మల్లెపల్లి సబ్ సెంటర్‌కు 'ఎన్‌క్వాస్'

90.79 శాతం స్కోర్‌తో జాతీయ నాణ్యతా ప్రమాణాల అవార్డుకు ఎంపిక

సంగారెడ్డి అర్బన్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలంలోని మల్లెపల్లి ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ (హెల్త్ సబ్ సెంటర్) జాతీయ నాణ్యతా ప్రమాణాలకు(ఎన్‌క్వాస్-నేషనల్ క్వాలిటీ అష్యూరెన్స్ స్టాండర్డ్స్) ఎంపికైంది. ఎక్స్‌టర్నల్ అసెస్‌మెంట్‌లో భాగంగా గత నెల 17వ తేదీన సబ్ సెంటర్‌ను కేంద్ర బృందం సభ్యులు వర్చువల్‌గా 7 అంశాలను సుదీర్ఘంగా పరిశీలించి గురువారం ఫలితాలు వెల్లడించారు. ఈమేరకు 90.79 స్కోర్ సాధించి జాతీయ నాణ్యత ప్రమాణాలకు ఎంపిక చేశారు. దీంతో ఎన్‌క్వాస్ అవార్డు పొందిన మల్లెపల్లి సబ్ సెంటర్‌కు ప్రోత్సాహక నగదు దక్కనుంది.



కొండాపూర్ మండలం మల్లెపల్లిలోని సబ్ సెంటర్

తాగునీటి సమస్య పరిష్కారానికి శాశ్వత చర్యలు

మెదక్ ఎంపీ రఘునందన్‌రావు

మెదక్ మున్సిపాలిటీ, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో తాగునీటి పరిష్కారానికి శాశ్వత చర్యలు తీసుకోబోతున్నట్లు మెదక్ ఎంపీ రఘునందన్‌రావు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అమృత్ 2.0 పథకం కింద రూ.30 కోట్లతో చేపట్టనున్న పనులకు గురువారం ఆయన హౌసింగ్ బోర్డు వద్ద భూమిపూజ చేశారు. అనంతరం మాట్లాడుతూ పట్టణంలోని 32 వార్డులకు నీటిని అందించేందుకు ఐదు వాటర్ ట్యాంకులు నిర్మిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఈఈ తిరుపతిరెడ్డి, బీజేపీ నాయకులు గడ్డం శ్రీనివాస్, నాయిని ప్రసాద్, కాశానాథ్, శివ, సతీష్, కిరణ్, చాట్ల నరేందర్, విక్రం తదితరులు పాల్గొన్నారు.



అమృత్ 2.0 పథకం పనులకు శంకుస్థాన చేస్తున్న ఎంపీ

రంగనాయకసాగర్‌కు రూ. 2 కోట్లు

జోగిపేట, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): 'అమృత్' పథకం కింద అందోలు-జోగిపేట మున్సిపాలిటీ పరిధిలోని రంగనాయకసాగర్ (పెద్ద చెరువు) ఎంపికైందని జిల్లా పురపాలకశాఖ ప్రజారోగ్య డిప్యూటీ ఈఈ కృష్ణమోహన్ పేర్కొన్నారు. చెరువును గురవారం ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. త్వరలోనే పనులను ప్రారంభిస్తామని తెలిపారు.



మెదక్ కలెక్టర్‌కు అవార్డు

మెదక్ అర్బన్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు చట్టాన్ని సమర్థంగా అమలు చేసినందుకు మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్‌కు అవార్డు వరించింది. ఆర్టీఐ దరఖాస్తుల పరిష్కారంలో రాష్ట్రస్థాయిలో మెదక్ జిల్లాను ద్వితీయ స్థానంలో నిలిపినందుకు ఈ అవార్డు లభించింది. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో గురువారం జరిగిన సమాచారహక్కు చట్టం వారోత్సవాల్లో గవర్నర్ విష్ణుదేవ్‌శర్మ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు.

అక్రమంగా నిల్వ చేసిన రేషన్ బియ్యం పట్టివేత

వెల్దుర్తి, అక్టోబరు9(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన వెల్దుర్తిలోని శ్రీగణేష్ ట్రేడింగ్ కంపెనీలో అక్రమంగా నిల్వ చేసిన రేషన్ బియ్యాన్ని గురువారం రాత్రి టాస్క్ ఫోర్స్ సిబ్బంది, వెల్దుర్తి పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. అలాగే శ్రీగణేష్ ట్రేడింగ్ కంపెనీలో మరో ప్రాంతం నుంచి తీసుకువచ్చిన రేషన్ బియ్యాన్ని అన్‌లోడ్ చేస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. అశోక్ లేలాండ్‌లో ఉన్న 52 బస్తాల రేషన్ బియ్యంను స్వాధీనం చేసుకొని స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అలాగే శ్రీగణేష్ ట్రేడింగ్ కంపెనీలోని ఓ గదిలో నిల్వ ఉంచిన 36 సంచుల రేషన్ బియ్యంను సీజ్ చేశారు.

మంజీర నదిలో దూకిన వ్యక్తి గల్లంతు

● కుటుంబ కలహాలతో జీవితంపై విరక్తి చెంది
● శివంపేటవాసిగా గుర్తింపు

పుల్కల్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మంజీర నది ప్రవాహంలో దూకిన మరొకరు గల్లంతైన సంఘటన సంగారెడ్డి జిల్లా పుల్కల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. స్థానికులు, ఎస్ఐ విశ్వజన్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చౌటకూర్ మండలం శివంపేట గ్రామానికి చెందిన బుడ్డోల్ల మల్లేశం(40) వివాహం ఎనిమిదేళ్ల క్రితం జరిగింది. కుటుంబ కలహాలతో భార్య పుట్టింటికి వెళ్లిపోవడంతో ఒంటరిగా జీవనం వెళ్లదీస్తున్నాడు. వారం రోజులుగా రెండవ వివాహం జరిపించాలంటూ తన సోదరుడు బుడ్డోల్ల మొగులయ్య, ఇతర స్నేహితుల దృష్టికి తీసుకువెళ్లాడు. దీపావళి తర్వాత వివాహం జరిపించే విషయం ఆలోచిస్తామని చెప్పినా వినకుండా మొండికేశాడు. ఈ క్రమంలో బుధవారం మధ్యాహ్నం ఇంటి నుంచి వెళ్లిపోయిన మల్లేశం, రాత్రి 7.30 గంటలకు శివంపేట వంతెన వద్దకు చేరుకుని మొబైల్ ఫోన్‌లో మాట్లాడుతూ అటు ఇటు తిరుగుతూ గ్రామస్థుల కంట పడ్డాడు. సంగారెడ్డి నుంచి శివంపేట వైపునకు వచ్చే కొత్త వంతెన వద్దకు వెళ్లి తన చెప్పులు, మొబైల్ ఫోన్, చేతి రుమాలు (కర్చీఫ్)ను వంతెనపై ఉంచి మంజీర నది ప్రవాహంలో దూకగా గల్లంతయ్యాడు. భార్య పుట్టింటికి వెళ్లిపోవడం, మరో వివాహం చేయాలని పట్టుబట్టడం కారణంగా జీవితంపై విరక్తి చెంది మంజీర నది ప్రవాహంలో దూకి ఉంటాడని మల్లేశం సోదరుడు బుడ్డోల్ల మొగులయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్ఐ ఎన్. విశ్వజన్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


మల్లేశం (ఫైల్)

నెలన్నర వ్యవధిలో ముగ్గురు..

సుమారు నెలన్నర వ్యవధిలో శివంపేట మంజీర నది ప్రవాహంలో ముగ్గురు వ్యక్తులు దూకి గల్లంతు కావడం చర్చనీయాంశంగా మారింది. ఆగస్టు 29వ తేదీన శివంపేట గ్రామానికి చెందిన బడంపేట మల్లేశంగౌడ్ గల్లంతు కాగా, మృతదేహం లభ్యమైంది. సెప్టెంబరు 30న జోగిపేటకు చెందిన యూట్యూబర్ అల్లె లోకచంద్ర ఇదే నీటి ప్రవాహంలో దూకి గల్లంతై ఇప్పటికీ ఆచూకీ లభించలేదు.

రూ.1.34కోట్ల విలువైన గంజాయి దహనం

సంగారెడ్డి క్రైం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లాలోని వివిధ ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో నమోదైన 26 కేసులలో సీజ్ చేసిన 143.9 కిలోల ఎండు గంజాయిని, 623 గంజాయి మొక్కలను పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్‌లోని మెడికేర్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో గురువారం ఎక్సైజ్ పోలీసులు దహనం చేశారు. దహనం చేసిన గంజాయి విలువ దాదాపు రూ.1.34కోట్ల వరకు ఉంటుందని ఎక్సైజ్ సంగారెడ్డి స్టేషన్ అధికారి ఎండీ నజీర్ పాషా తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ అధికారులు పాల్గొన్నారు.


గంజాయిని దహనానికి సిద్ధం చేస్తున్న పోలీసులు


వివరాలు వెల్లడిస్తున్న గజ్వేల్ ఏసీపీ నర్సింహులు

మహిళ హత్య కేసులో ముగ్గురి అరెస్టు


● వివరాలు వెల్లడించిన గజ్వేల్ ఏసీపీ నర్సింహులు

జగదేవ్‌పూర్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : మహిళ హత్య కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని గజ్వేల్ ఏసీపీ నర్సింహులు తెలిపారు. గురువారం జగదేవ్‌పూర్ మండలం బస్వాపూర్ గ్రామంలో మహిళ హత్య కేసు వివరాలను ఆయన వెల్లడించారు. జగదేవ్‌పూర్ మండలం బస్వాపూర్ గ్రామానికి చెందిన ఆలేటి యాదవ రెడ్డికి ఇద్దరు కుమార్తెలు ఉండగా, చిన్న కూతురు అపర్ణ తన ఇంటి సమీపంలో ఉండే అబ్బాస్ అనే వ్యక్తిని ప్రేమించింది. పెళ్లికి అపర్ణ తల్లిదండ్రులు ఒప్పుకోకపోవడంతో జనవరిలో ప్రేమ వివాహం చేసుకున్నట్లు తెలిపారు. అబ్బాస్, అపర్ణ జనగాం, ఆ తర్వాత కుకునూరుపల్లిలో కొద్ది రోజులు నివాసం ఉన్నారు. మూడు నెలల క్రితం అపర్ణ, అబ్బాస్‌ల మధ్య గొడవలు రావడంతో అపర్ణ తన తండ్రి యాదవ రెడ్డి ఇంటికి వచ్చింది. తిరిగి అబ్బాస్ దగ్గరికి వెళ్దామనే ఆలోచనతో అపర్ణ, అబ్బాస్‌ను తనను తీసుకొని వెళ్లమని కోరగా, మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు అబ్బాస్ తన కారు తీసుకొని అపర్ణ ఇంటికి వచ్చి ఆమెను తనతోపాటు తీసుకొని వెళ్లాడు. దీంతో ఆగ్రహానికి గురైన యాదవరెడ్డి, అతని భార్య నిర్మల, యాదవరెడ్డి తమ్ముడు రాంరెడ్డి ఒక ఇనుప రాడ్ తీసుకొని వారి ఇంటికి సమీపంలోనే ఉండే అబ్బాస్ ఇంటికి వెళ్లి, అతని తల్లి అయిన సాహీం బేగంను ఇనుపరాడుతో తలపై కొట్టడంతో ఆమె తీవ్ర గాయాలపాలైంది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే వెళ్లి ఆమెను ఆసుపత్రికి తరలించగా, మార్గమధ్యలో మరణించింది. అనంతరం మృతురాలి కొడుకు అబ్బాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. వారి నుంచి హత్యకు ఉపయోగించిన ఇనుప రాడు, కర్ర స్వాధీనం చేసుకుని జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. సమావేశంలో గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్ రెడ్డి, జగదేవ్‌పూర్ ఎస్ఐ కృష్ణారెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.












పవన్‌ను తల్లికి అప్పగిస్తున్న ఎస్ఐ పాండు

చిక్కిన బాలుడి ఆచూకీ

● బంధువులే తీసుకెళ్లారు..
● తల్లికి అప్పగించిన పోలీసులు

జోగిపేట రూరల్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): అందోల్ మండల పరిధి తాడ్మనూర్ గ్రామంలో కలకలం రేపిన బాలుడి కిడ్నాప్ కథ సుఖాంతమైంది. మనవడిపై ప్రేమ, అతన్ని చూడాలన్న తాతా బాబురావు కోరిక తీర్చాలని బంధువులే బాలుడిని తీసుకెళ్లారు. ఎస్ఐ పాండు కథనం ప్రకారం.. రాయికోడ్‌కు చెందిన పద్మ, కర్ణాటకలోని భగ్దార్‌కు చెందిన అర్జున్‌కు నలుగురు ఆడపిల్లలు, ఒక బాబు పవన్ ఉన్నారు. అర్జున్ తన బావమరిది అయిన తాడ్మనూర్‌కు చెందిన మరాఠా రాజు(పద్మ పెద్దనాన్న కుమారుడు)తో కలిసి అందోల్ మండల పరిధిలో కొన్ని రోజులు ఎడ్ల వ్యాపారం చేశాడు. ఎడ్ల కొనుగోలు వ్యవహారంలో రూ. 6 లక్షలతో అర్జున్ పరారయ్యాడు. ఈ డబ్బుల కోసం బాధితులు మరాఠా రాజును వేధించడం మొదలు పెట్టారు. దీంతో రాజు.. కర్ణాటకకు వెళ్లగా ఆచూకీ లభించలేదు. చెల్లెలు, ఆమె పిల్లలను తీసుకువస్తే అర్జున్ వస్తాడని భావించి వారిని తాడ్మనూర్‌కు తీసుకువచ్చాడు. కొన్ని రోజులకు పద్మ పుట్టింటికి వెళ్లి వస్తానని చెప్పి, పవన్‌ను అక్కడే ఉంచి నలుగురు ఆడపిల్లలతో వెళ్లింది. అయితే, కిడ్నాప్‌కు గురైన పవన్‌ను చూడాలని ఉందని అతని తాతా బాబురావు తన కుమార్తె కొడుకులు సునీల్, రవిలకు చెప్పుకున్నాడు. దీంతో ఎలాగైనా మనవడిని తాతవద్దకు చేర్చాలని భావించిన వారు బుధవారం గ్రామానికి వచ్చారు. బాలుడు ఆడుకుంటున్న సమయంలో పవన్‌ను తమ ద్విచక్ర వాహనంపై కర్ణాటక తీసుకెళ్లారు. దీంతో మరాఠా రాజు జోగిపేట పోలీసులను ఆశ్రయించాడు. కేసు దర్యాప్తు ప్రారంభించిన ఎస్ఐ పాండు ఆ ప్రాంతంలోని సీసీ కెమెరాలను పరిశీలించగా, బాలుడిని ద్విచక్రవాహనంపై తీసుకెళ్లినట్లు తేలింది. సీసీ కెమెరాల ఆధారంగా పోలీసులు కర్ణాటక వెళ్లినట్లు తెలుసుకుని పోలీసులు అక్కడికి వెళ్లి బాలుడిని క్షేమంగా తీసుకువచ్చి, తల్లికి అప్పగించారు. బాలుడిని కిడ్నాప్ చేసి తీసుకెళ్లిన ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు.



ఎస్సీ ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ తండ్రి కన్నుమూత

● మాజీ సీఎం కేసీఆర్ సంతాపం


విజ్జయ్య మృతదేహానికి పూలమాల వేసి నివాళులార్పిస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు తదితరులు

చిన్నకోదూరు/హైదరాబాద్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): చిన్నకోదూరు మండలం గంగాపూర్‌లో రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ తండ్రి ఎర్రోళ్ల విజ్జయ్య (85) అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. విజ్జయ్య మృతిపై బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు సంతాపం ప్రకటించారు. విజ్జయ్య మృతి తనను కలచి వేసిందని, ఆయన ఆత్మకు శాంతిచేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. శ్రీనివాస్ కుటుంబ సభ్యులకు తన ప్రగాఢసానుభూతి తెలిపారు. మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు విజ్జయ్య మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆయన వెంట కార్పొరేషన్ మాజీ చైర్మన్‌లు ప్రతాప్‌రెడ్డి, బాల్‌రాజు, దేవి ప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కనకరాజు, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణ శర్మ, మండలాధ్యక్షుడు శ్రీనివాస్, మాజీ ఎంపీపీ మాణిక్య రెడ్డి, మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.

ప్రముఖ పురోహితులు, అవధాని శ్రీనాథశర్మ కన్నుమూత

కొమురవెల్లి, అక్టోబర్ 9 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మండలం మర్రిముస్త్యాల గ్రామంలోని ప్రముఖ గురుసాంద్రానంద ఆశ్రమం నిర్వాహకులు, ప్రముఖ పురోహితులు, అవధాని, కవి, సాహితీవేత్త, గురు సాంద్రానంద స్వామిజీ రెండో కుమారుడు అయిన గౌరీభట్ల శ్రీనాథ శర్మ(74) గురువారం సాయంత్రం అనారోగ్యంతో ఆశ్రమంలో కన్నుమూశారు. శ్రీనాథ శర్మ ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఆయన పలు సామాజిక కార్యక్రమాలు నిర్వహించి ప్రజల్లో ఆధ్యాత్మికతను పెంపొందించేందుకు కృషి చేశారు. శ్రీనాథ శర్మ మృతితో గ్రామస్థులు, ఆశ్రమ భక్తులు తీవ్ర బాధలో మునిగిపోయారు.


గౌరిభట్ల శ్రీనాథశర్మ (ఫైల్)

బొలెరోను ఢీ కొట్టిన డీసీఎం

● డ్రైవర్‌కు స్వల్ప గాయాలు
● టమాటాలు ఎత్తుకెళ్లిన స్థానికులు

కంది, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): కంది మండల కేంద్రంలోని కంది-శంకర్‌పల్లి హైవేలో టమాటాల లోడ్‌తో జహీరాబాద్ వైపుకు వెళ్తున్న బొలెరో వాహనాన్ని ఆర్టీఏ కార్యాలయం వద్ద గురువారం తెల్లవారుజామున ఓ డీసీఎం అతివేగంగా వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో బొలెరో వాహనం అదుపుతప్పి రోడ్డుపక్కకు పడిపోయింది. ఈ ఘటనలో బొలెరో డ్రైవర్ బీదర్‌కు చెందిన మనోజ్‌కు స్వల్ప గాయాలయ్యాయి. బొలెరోలో ఉన్న టమాటాలు చెల్లాచెదురుగా రోడ్డుపక్కన పడగా, స్థానికులు వాటిని సంచుల్లో, డబ్బాల్లో నింపుకుని ఎత్తుకెళ్లారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సంగారెడ్డి రూరల్ పోలీసులు తెలిపారు.


టమాటాలు తీసుకెళ్తున్న స్థానికులు

ఎన్నికల్లో పోటీ చేస్తే బాండ్ పేపర్ రాసి ఇవ్వాలి

● నంగునూరు యువత వినూత్న డిమాండ్

● సోషల్ మీడియాలో వైరల్



నంగునూరు యువత ప్రింట్ చేసిన బాండు పేపర్

నంగునూరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : గ్రామ సమగ్రాభివృద్ధికి కృషి చేస్తానని, ప్రజలకు సేవ చేస్తానని బాండ్ పేపర్ రాసి ఇస్తేనే తమ ఓటు వేస్తామని నంగునూరు యువత ప్రకటించింది. ఈ మేరకు వారు రూపొందించిన బాండ్ పేపర్ గురువారం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. గ్రామ సర్పంచ్‌గా పోటీ చేయాలనుకుంటున్నారా? అయితే మీరు ఈ బాండ్ పేపర్‌పై సంతకం చేసి, మీ నామినేషన్లు దాఖలు చేయండి అంటూ నంగునూరు మండల యువత రూపొందించిన వంద రూపాయల బాండ్ పేపర్ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. తాను గెలిచిన తర్వాత అక్రమ ఆస్తులు సంపాదించనని, పదవి ముగిసిన తర్వాత ఆస్తులు పెరిగితే వాటిని గ్రామానికే అప్పగిస్తానని, గ్రామ పంచాయతీ పనుల కోసం ప్రజల వద్ద డబ్బులు అడగనని, తప్పుడు లెక్కలు చూపనని, గ్రామ అభివృద్ధికి ఒక సేవకుడిగా పనిచేస్తాననే షరతులతో కూడిన ఈ బాండ్ పేపర్‌ను తయారు చేసి సోషల్ మీడియాలో పెట్టడంతో ఇది వైరల్‌గా మారింది. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో నంగునూరు మండల యువత రూపొందించిన ఈ వినూత్న డిమాండ్ చర్చనీయాంశమైంది. సర్పంచ్‌గా పోటీ చేసేవారు ఈ బాండ్ పేపర్‌ను ఆదర్శంగా తీసుకుంటారా.. లేక కొట్టిపారేస్తారా అన్నది ఇప్పుడు ఆసక్తిగా మారింది.

'పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలి'


సమావేశమైన పెన్షనర్లు

సిద్దిపేట క్రైం, అక్టోబర్ 9 (ఆంధ్రజ్యోతి): స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ తెలంగాణ సిద్దిపేట జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షుడు చిల్ల నరసింహులు అధ్యక్షతన గురువారం సిద్దిపేటలో జరిగింది. ఈ సమావేశానికి రాష్ట్ర కార్యదర్శి జోగు భిక్షపతి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మార్చి 2024 తర్వాత పదవీ విరమణ చేసిన వారికి పెన్షన్ బెనిఫిట్లు ఇంకా లభించకపోవడం, స్పెషల్ టీచర్లకు నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరుకాకపోవడం, హెల్త్‌కార్డులు పనిచేయక వైద్య సేవలకు ఇబ్బందులు, పెండింగ్‌లో ఉన్న ఐదు విడతల డీఏల అమలులో జాప్యం వంటి సమస్యలపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే, పెన్షనర్ల సమస్యలను ప్రత్యేకంగా పరిష్కరించే డైరెక్టర్‌ను నియమించాలని, 20 ఏళ్ల సేవ అనంతరం పదవీ విరమణ చేసిన ఉద్యోగులందరికీ పూర్తి పెన్షన్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మధుసూదన్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు పి. అన్నమరెడ్డి, నారాయణరెడ్డి, సత్తయ్య, బన్సీలాల్, ఇంద్రసేనారెడ్డి, నాగేందర్, శ్రీనివాస్, రవీందర్ రెడ్డి, పరశురాములు, బాల నరసయ్య, భగవాన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో 'ఆస్కీ' బృందం తనిఖీ

● ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటు కోసం ఆరా


జోగిపేట ఆస్పత్రిలో ఆస్కీ బృందం

జోగిపేట, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): జోగిపేటలోని ఏరియా ఆస్పత్రిలో అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా (ఆస్కీ)కి చెందిన వైద్యుల బృందం గురువారం తనిఖీలు నిర్వహించింది. ఆస్పత్రిలో అందుతున్న సేవలు, సదుపాయాలు, చికిత్సల గురించి ఆరా తీసింది. ఆస్పత్రి ఆవరణను పరిశీలించిన వారు.. అక్కడ ఏర్పాటు చేసిన పచ్చిక బయళ్లు, మొక్కల పెంపకంపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఆస్పత్రిలో, ఆవరణలోనూ పరిశుభ్రత బాగుందని అభినందించారు. 24 గంటలూ అందుబాటులో ఉన్న ల్యాబ్ సేవలు, ఫార్మసీ విభాగం పనితీరుపై కూడా అభినందించారు. డాక్యుమెంటేషన్ కూడా సమగ్రంగా ఉందని ప్రశంసించారు. ప్రతి 30 కిలోమీటర్లకు ఒకటి చొప్పున ట్రామా కేర్ సెంటర్లను ఏర్పాటు చేయాలన్న ప్రభుత్వ ఆదేశం మేరకు, ఇక్కడి ఆస్పత్రిలో సెంటర్ ఏర్పాటుకు ఉన్న స్థలం, వసతుల గురించి కూడా ఆస్కీ బృంద సభ్యులు ఆరా తీశారు. ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటుకు సరిపడినంత స్థలం ఉండడంపై హర్షం వ్యక్తం చేశారు. అవసరమైన సదుపాయాల గురించి పరిశీలించి నివేదిక తయారు చేశారు. వారి వెంట ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సౌజన్య, ఆర్ఎంవో డాక్టర్ అశోక్, స్టాఫ్ నర్సులు సునంద, పుల్లమాంబ, యూడీసీ రమేశ్, ఇన్ఫెక్షన్ కంట్రోల్ నర్సు శ్రీవాణి ఉన్నారు.

కథల పోటీల్లో శనిగరం విద్యార్థిని ప్రతిభ


విద్యార్థినికి ప్రశంసా పత్రం అందజేస్తున్న ఎంఈవోలు

కోహెడ, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేటలో సుగుణ సాహితీ సమితి నిర్వహించిన బాలల కథల పోటీలలో కోహెడ మండలం శనిగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 9 వ తరగతి విద్యార్థిని నేరెళ్ల శ్రీహర్షిత తృతీయ బహుమతి గెలుచుకుంది. గురువారం పాఠశాలలో విద్యార్థినికి ప్రశంసా పత్రం అందించడంతో పాటు, శిక్షణ ఇచ్చిన తెలుగు భాషా ఉపాధ్యాయులు రచ్చ జగదీశ్వర్‌ను అభినందించారు. 'స్నేహమే బహుమతి' అనే కథకు జిల్లా స్థాయిలో శ్రీహర్షిత తృతీయ బహుమతికి ఎంపికైంది. తెలంగాణ సారస్వత పరిషత్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ చెన్నయ్య విద్యార్థినిని శాలువాతో సత్కరించి, మెమొంటో, నగదు బహుమతిని అందజేశారు. అలాగే పలు గ్రంథాలయ పుస్తకాలను విద్యార్థికి ఉచితంగా అందించారు. కార్యక్రమంలో డాక్టర్ మట్ట సంపత్ కుమార్ రెడ్డి, మండల విద్యాధికారులు యాదవరెడ్డి, ఆర్ పద్మయ్య, హెచ్ఎం ఎం సరళ, కన్వీనర్ దుర్గయ్య, రాజు పాల్గొన్నారు.

ఎనిమిది మందిపై అట్రాసిటీ కేసు

● విచారణ చేపట్టిన డీఎస్పీ

శివ్వంపేట, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి పాంబండ గ్రామంలో దళిత కుటుంబానికి చెందిన జానకీ 30 ఏళ్ల క్రితం భూమి కొనుగోలు చేసి నివాసముంటుంది. ఇటీవల ఇందిరమ్మ ఇల్లు మంజూరు కావడంతో నిర్మాణం చేపట్టింది. ఇదే గ్రామానికి చెందిన దశరథ, మల్లయ్య, భూమయ్య కుటుంబసభ్యులు ధరణి పాస్ పుస్తకంలో భూమి తమ పేరు ఉందని జానకీ చేపడుతున్న ఇంటి నిర్మాణాన్ని అడ్డుకున్నారు. ఈ క్రమంలో గొడ్డలితో ఆమెపై దాడికి ప్రయత్నించి, కులంపేరుతో దూషించారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మూడు రోజుల క్రితం పోలీసులు ఎనిమిది మందిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో తూప్రాన్ డీఎస్పీ నరేందర్ గౌడ్, ఎస్సై మధుకర్‌రెడ్డితో కలిసి గురువారం గ్రామానికి వచ్చి విచారణ జరిపారు.

జహీరాబాద్

పారిశ్రామిక కారిడార్‌గా వెలుగు

నిమ్జ్, స్మార్ట్ సిటీ సహా పలు పరిశ్రమలు

పెరగనున్న ఉద్యోగ, ఉపాధి అవకాశాలు

ఆకాశాన్నంటిన భూముల ధరలు


హుగ్గెల్లి నుంచి నిమ్జ్ వరకు వేసిన బీటీరోడ్డు



జహీరాబాద్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): జహీరాబాద్ నియోజకవర్గం పారిశ్రామిక కారిడార్‌గా(ఇండస్ట్రీయల్ హబ్) మారబోతోంది. ఈ ప్రాంతంలోని ఝరాసంగం, న్యాల్‌కల్, కోహీర్, జహీరాబాద్ ప్రాంతాల్లో పలు పరిశ్రమలు ఏర్పాటు అవుతుండంతో ఉపాధిలో కీలకంగా మారనుంది. ఇప్పటికే జహీరాబాద్ ప్రాంతంలో మహీంద్రా అండ్ మహీంద్రా, దాని అనుబంధ కర్మాగారాలు, నికోలాస్, హట్సాన్ తదితర పరిశ్రమలు ఏర్పాటు అయ్యాయి. దీనికి తోడుగా నియోజకవర్గంలోని కోహీర్, ఝరాసంగం, న్యాల్‌కల్ మండలాల్లో సుమారు 17వేల ఎకరాల్లో వివిధ రకాల పరిశ్రమల ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయి. నియోజకవర్గంలో నిమ్జ్ కోసం భూ సేకరణ జరుగుతోంది. ఇందులో ఇప్పటికే టీఎస్ఐఐసీ 511 ఎకరాలు, వెమ్ టెక్నాలజీకి 408 ఎకరాలను కేటాయించారు. ఇక హైదరాబాద్-నాగ్‌పూర్ ఇండస్ట్రీయల్ కారిడార్‌లో భాగంగా నియోజకవర్గంలోని ఝరాసంగం, న్యాల్‌కల్ మండలాల్లో ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీని ఏర్పాటు చేయనున్నారు. న్యాల్‌కల్ మండలంలోని డప్పూర్, మల్గి, వడ్డీ తదితర గ్రామాల్లో ఫార్మాసిటీ ఏర్పాటుకు, కోహీర్-మునిపల్లి మండలాల్లో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వాలు అడుగులు వేస్తున్నాయి. పరిశ్రమలతో పాటు రవాణా రంగాన్ని అభివృద్ధి చేసేందుకు వికారాబాద్ నుంచి పర్లీ వరకు 273 కిలో మీటర్ల కొత్త రైల్వేలైన్, అదే జిల్లా తాండూరు నుంచి జహీరాబాద్‌కు 75 కిలోమీటర్ల కొత్త రైల్వేలైన్ వేయనున్నారు. నియోజకవర్గంలో వివిధ పరిశ్రమల కోసం ప్రభుత్వం చర్యలు తీసుకుంటుండటంతో వ్యవసాయ, వ్యవసాయేతర భూముల ధరలు పెరిగిపోయాయి. ఈ ప్రాంతంలో ఎకరా భూమి సగటున సుమారు రూ. 70 లక్షల నుంచి మొదలు కొని.. కొన్ని ప్రాంతాల్లో రూ. ఎనిమిది కోట్ల వరకు పలుకుతోంది.

ఉపాధికి అవకాశాలు

జహీరాబాద్ ప్రాంతంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుకున్న మేరకు పరిశ్రమలు ఏర్పాటు అయితే సుమారు పది లక్షల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయని అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో నియోజకవర్గంలో యువత కోసం ప్రత్యేకంగా స్కిల్ డెవలప్‌మెంట్ కళాశాలను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.


జహీరాబాద్ పట్టణం

ఇండస్ట్రీయల్ హబ్‌గా..



జహీరాబాద్ రానున్న రోజుల్లో ఇండస్ట్రీయల్ హబ్‌గా మారనుంది. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో నిమ్జ్ అభివృద్ధి వేగంగా సాగుతోంది. కేంద్రంలో యూపీఏ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో మాజీ మంత్రి గీతారెడ్డి ప్రత్యేక చొరవతో 2013లో నిమ్జ్ తీసుకువచ్చారు. గత ప్రభుత్వ హయాంలో ఈ పనుల్లో నిర్లక్ష్యం జరిగినా, సీఎం రేవంత్‌రెడ్డి, తాను, పలువురు మంత్రులు కలిసి నిమ్జ్‌లో స్మార్ట్ సిటీ ఏర్పాటుకు కృషి చేశాం. పరిశ్రమల కోసం సాగుకు అనువుగా లేని, ప్రభుత్వ భూములే తీసుకునేలా చర్యలు చేపడుతున్నాం.

- సురేష్‌కుమార్ షెట్కార్, ఎంపీ

భూములిచ్చింది వారే.. తీసుకుంటుందీ వారే..



నియోజకవర్గంలో భూమి లేని నిరుపేదలకు భూములు ఇచ్చింది అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వమే. ఇప్పుడు తీసుకుంటుంది కూడా ఆ పార్టీ ప్రభుత్వమే. పరిశ్రమల కోసం సేకరిస్తున్న భూముల్లో ఎక్కువగా సాగుకు యోగ్యమైనవే. పరిశ్రమలు రావడం మంచిదే. ఈ ప్రాంత యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి. కానీ, భూములు కోల్పోతున్న రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారుతోంది. ఫార్మాసిటీతో ప్రజలు కాలుష్యం బారిన పడే ప్రమాదం ఉంది. ఫార్మాసిటీ కాకుండా ప్రత్యామ్నాయంగా కాలుష్యం లేని కర్మాగారాలను ఏర్పాటు చేయాలి.

- కొనింటి మాణిక్‌రావు, ఎమ్మెల్యే

యువతకు శిక్షణ



నియోజకవర్గంలో నిమ్జ్, స్మార్ట్ సిటీ ఏర్పాటుతో నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయి. ఇక్కడ ఏర్పాటు అయ్యే పరిశ్రమలను దృష్టిలో పెట్టుకుని సెట్విన్, న్యాక్‌ల ఆధ్వర్యంలో పది ఎకరాల్లో 60 రకాల నైపుణ్యాలతో యువతకు శిక్షణ అందించేందుకు చర్యలు చేపడుతాం. సెట్విన్ ఆధ్వర్యంలో వివిధ రకాల కోర్సులను ఏర్పాటు చేశారు. ఫార్మాసిటీతో అందరికీ నష్టమే. అందుకే ఫార్మాసిటీకి రెండు ఎకరాలకు బదులుగా 900 ఎకరాలకు కుదించారు. ఫార్మాసిటీ వద్దన్న అంశాన్ని మంత్రుల దృష్టికి తీసుకెళ్తే, వారు సానుకూలంగా స్పందించారు.

- గిరిధర్‌రెడ్డి, సెట్విన్ చైర్మన్

అపోలో ట్యూబ్స్ పరిశ్రమ ఉద్యోగుల నిరసన


అర్ధనగ్న ప్రదర్శనతో నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

చేగుంట, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): పర్మినెంట్ ఉద్యోగులను సుదూర ప్రాంతాలకు బదిలీ చేస్తూ పరిశ్రమ యజమాన్యం ఉద్యోగులను ఇబ్బందుల పాలు చేస్తుందని బీఎంఎస్ జిల్లా జనరల్ సెక్రటరీ నర్సింహులు పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని వడియారం అపోలో ట్యూబ్స్ పరిశ్రమ ముందు ఉద్యోగులు అర్ధనగ్న ప్రదర్శనతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తాము గత 14 సంవత్సరాలుగా పరిశ్రమలో పర్మినెంట్ ఉద్యోగులుగా పనిచేస్తున్నామని, యాజమాన్యం కొంతమందిని సుదూర ప్రాంతాలకు బదిలీ చేస్తూ ఇబ్బందులకు గురిచేస్తుందని అన్నారు. మూడు రోజులుగా పర్మినెంట్ ఉద్యోగులు, కార్మికులు పలు రకాలుగా నిరసన తెలిపినప్పటికీ, యాజమాన్యం మొండి వైఖరి అవలంబిస్తుందని విమర్శించారు. కొన్ని సంవత్సరాలుగా ఇక్కడే పనిచేస్తూ, స్థిరపడిన ఉద్యోగులను, కార్మికులను ఒక్కసారిగా సుదూర ప్రాంతాలకు బదిలీ చేయడం అన్యాయమన్నారు. పరిశ్రమ మేనేజ్‌మెంట్ తక్షణమే బదిలీల ఆదేశాలను వెనక్కి తీసుకోవాలని లేదంటే బీఎంఎస్ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని జిల్లా, రాష్ట్ర స్థాయికి తీసుకెళ్తామని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో బీఎంఎస్ యూనియన్ సభ్యులు కుంట రాజ్ కుమార్, చవాన్ సురేష్, సునీల్ పాస్వన్, నవీన్ యాదవ్, శ్రీనివాస్, కుమార్, పెద్ద కృష్ణ యూనియన్ నాయకులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ హామీలను అమలు చేయాలి : టీపీటీఎఫ్


సభ్యత్వ నమోదు కార్యక్రమంలో నాయకులు

సిద్దిపేట కల్చరల్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికలకు ముందు ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నింటిని నెరవేర్చాలని టీపీటీఎఫ్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు తిరుపతి రెడ్డి డిమాండ్ చేశారు. సిద్దిపేట అర్బన్ మండలంలోని బూరుగుపల్లి, ఇమాంబాద్, లింగారెడ్డి పల్లె, మందపల్లి, నర్సాపూర్, కేసీఆర్ నగర్, రంగధాంపల్లె, మిట్టపల్లి, బక్రీ చెప్యాల తదితర పాఠశాలల్లో సమస్యల సేకరణ, సభ్యత్వ కార్యక్రమాన్ని అర్బన్ మండల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతిరెడ్డి మాట్లాడుతూ పెండింగ్ బిల్లుల విషయంలో ప్రభుత్వం మాట తప్పడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. పెండింగ్ బిల్లుల కొరకు ప్రతి నెల రూ.700 కోట్లు ఇస్తామని టీజీఈజేఏసీ నాయకులకు హామీ ఇచ్చి, కేవలం రెండు నెలలు మాత్రమే చెల్లించారని తెలిపారు. గత నెలలో సుమారు రూ.200 కోట్ల విలువైన ఒక నెల జీపీఎఫ్ బిల్లులు మాత్రమే చెల్లించి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. దసరా సందర్భంగా ఉద్యోగులు డీఏ, హెల్త్‌కార్డ్ ప్రభుత్వం ప్రకటిస్తుందని ఆశించారని, కానీ ప్రతి నెలా ఇచ్చే రూ.700 కోట్లకు కూడా గండి పెట్టడంతో ఉపాధ్యాయులు, ఉద్యోగులు తీవ్ర నిరాశకు గురయ్యారన్నారు. జూలై 2023 నుంచి రావాల్సిన పీఆర్‌సీని వెంటనే అమలు చేసి ఉద్యోగ, ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ కె. తిరుపతి, మండల శాఖ అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాస్ గౌడ్, అనిల్ కుమార్, జిల్లా కౌన్సిలర్ మల్లేశం, భాస్కర్, రాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు తనిఖీ చేసిన కేంద్ర బృందం



మొక్కలు నాటుతున్న అదనపు డైరెక్టర్ జనరల్ సంజీవ్‌కుమార్

పటాన్‌చెరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : మదీనాగూడ నుంచి సంగారెడ్డి కూడలి వరకు రూ.800 కోట్ల అంచనా వ్యయంతో జరుగుతున్న జాతీయ రహదారి పనులను తనిఖీ చేయడానికి నేషనల్ హైవే అథారిటీ ఉన్నతస్థాయి అధికారుల బృందం పటాన్‌చెరుకు వచ్చింది. రోడ్లు భవనాల శాఖకు చెందిన అతిథిగృహంలో వారు మొక్కలు నాటారు. అనంతరం కేంద్ర, రాష్ట్ర హైవే అథారిటీ అధికారులతో అదనపు డైరెక్టర్ జనరల్ సంజీవ్‌కుమార్ సమీక్ష నిర్వహించారు. పనులు ప్రారంభానికి ఎదురవుతున్న ఇబ్బందులను స్థానిక అధికారులు పీపీటీ ద్వారా వివరించారు. ముఖ్యంగా రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్న సమయంలో రైతుల భూముల సేకరణ వ్యవహారాన్ని తెలిపారు. అనంతరం రోడ్డు పనుల ఫోటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. మదీనాగూడ నుంచి సంగారెడ్డి కూడలి వరకు కారులోనే ఉండి రోడ్డు పనుల తీరును పరిశీలించారు. లక్డారం గ్రామ గేటు వద్ద వంతెన పనులను చూసి డీఈ రామకృష్ణను వివరాలు అడిగారు. అనంతరం అవుటర్ రింగ్ రోడ్డు మీదుగా హైదరాబాద్‌లో ఉన్నతస్థాయి అధికారులతో సమావేశమయ్యారు. కేంద్ర అధికారులు కృష్ణప్రసాద్, జయభర్తి, ధర్మారెడ్డి, షరీన్ శర్మపింటు, రమేష్, సీఎస్ శాస్త్రి, కృష్ణగోయల్, వీ. రమేష్, ఏఈ ఆవుల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సంగ్రామం.. విరామం

(5వ పేజీ తరువాయి)

ప్రయాస పడడం కంటే తీర్పు వచ్చాకే అట్టహాసంగా దాఖలు చేయాలని భావించారు. చివరకు ఎన్నికలు వాయిదా పడడంతో ఆగిపోక తప్పలేదు.

మరోనెల ఉత్కంఠనే..

తాత్కాలికంగా ఎన్నికలు వాయిదా పడడంతో మరోనెల రోజుల పాటు ఉత్కంఠ తప్పని పరిస్థితి. ఇప్పటికే రిజర్వేషన్లు ప్రకటించడంతో ఆ దిశగా ఆశావహులు ముందుకెళ్లారు. రిజర్వేషన్లు అనుకూలించని వారు నిరుత్సాహంలో మునిగారు. తాజాగా రిజర్వేషన్లపై సందిగ్ధత నెలకొనడంతో ఆశావహులు తర్జనభర్జన పడుతున్నారు. మార్పులు, చేర్పులు ఉంటాయనే కోణంలో ఆశలు పెట్టుకున్నారు. 42 శాతం బీసీలకు దక్కకుంటే తమకు లాభిస్తుందని ఓసీ కేటగిరి ఆశావహులు భావిస్తున్నారు. మండలం, జిల్లా యూనిట్‌గా రిజర్వేషన్లు మారుతాయని చర్చ జరుగుతుండడంతో మళ్లీ అందరూ తెరపైకి వచ్చారు. వచ్చే నెలరోజుల పాటు ఊపిరిబిగపట్టడం తప్ప చేసేదేమీ లేదని ఆశావహులు చెబుతున్నారు.

ధాన్యం కొనుగోలుకు స్థలం కేటాయించాలి

● బైక్ ర్యాలీగా వెళ్లి తహసీల్దార్‌కు వినతి

రామాయంపేట, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలుకు స్థలం కేటాయించాలని రామాయంపేట మండల పరిధిలోని రాయిలాపూర్ గ్రామస్థులు కోరారు. ఈ మేరకు గురువారం యువకులు, ప్రజలు సుమారు 350 మంది బైక్ ర్యాలీగా రామాయంపేట తహసీల్దార్ కార్యాలయానికి తరలివచ్చి వినతిపత్రం అందించారు. తాము పండించిన ధాన్యం ఎక్కడ ఆరబెట్టాలో, ఎక్కడ అమ్మాలో తెలియక ఈ ఆందోళనకు సిద్ధమయ్యామని గ్రామస్థులు తెలిపారు. ఒకవైపు పోలీసులు రోడ్లపై వరి ధాన్యం ఆరబోయొద్దని హెచ్చరికలు జారీ చేస్తున్నారు, మరోవైపు ఇందుకు కావాల్సిన స్థలం లేదు. పంటను ఎక్కడ విక్రయించాలి? ఎక్కడ ఆరబెట్టాలి? మీరే చెప్పాలంటూ తహసీల్దార్ రజనీకి విన్నవించారు.


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రాయిలాపూర్ గ్రామస్థులు

రిటైర్మెంట్ బకాయిలు ఎప్పుడు ఇస్తారు?

● సర్కారు స్పందించకపోతే ఆందోళన ఉధృతం చేస్తాం

● రేవా కమిటీ సమావేశంలో రిటైర్డ్ ఉద్యోగుల ఆందోళన

సిద్దిపేట క్రైం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): 18 నెలలు గడిచినా రిటైర్మెంట్ బకాయిలు రాకపోవడంతో రిటైర్డ్ ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని రేవా (రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్) ఆందోళన వ్యక్తం చేసింది. గురువారం సిద్దిపేట ప్రెస్ క్లబ్‌లో జరిగిన సిద్దిపేట జిల్లా రేవా సమావేశానికి పోనమల్ల రాములు అధ్యక్షత వహించారు. గత సంవత్సరం మార్చిలో రిటైర్డ్ అయిన ఉద్యోగులకు జీపీఎఫ్, జీఐఎస్, ఈఎల్ఎస్, కమిటేషన్, గ్రాట్యూటీ మొదలైన బకాయిలు భారీగా పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ఈ బకాయిలు రాక కొందరు గుండె పగిలి మరణించారని పేర్కొన్నారు. ఇంత జరుగుతున్నా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం దారుణమన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం చట్టబద్ధంగా స్పందించి బకాయిలు విడుదల చేయకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం డీఏ ఇవ్వడం లేదని, పీఆర్‌సీ అమలు చేయడం లేదని వాపోయారు. ఈ సందర్భంగా సిద్దిపేట జిల్లా రేవా కమిటీని ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా పోనమల రాములు, సెక్రటరీగా ఎండీ సలీం, కోశాధికారిగా రాజిరెడ్డి, పీఆర్‌ఓగా విష్ణు, సలహాదారులుగా జయ సింహారెడ్డి, వీడీగా శ్రీనివాస్ ఎన్నికయ్యారు.

విద్యార్థి మృతిపై విచారణ..

హుస్నాబాద్ రూరల్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 7న జిల్లెలగడ్డ సాంఘిక సంక్షేమశాఖ (బాలుర) గురుకుల పాఠశాలలో ఎనిమిదో తరగతి విద్యార్థి వివేక్ అనుమానాస్పదంగా మృతి చెందిన సంఘటనపై గురువారం గురుకులాల సొసైటీ డిప్యూటీ కార్యదర్శి సహజ విచారణ చేపట్టినట్లు తెలిసింది. పాఠశాల వేళల్లో ఎవరెవరున్నారు, విద్యార్థి వివేక్ ఏ విధంగా మృతి చెందాడనే అంశాలపై ఉపాధ్యాయులు, పాఠశాల ప్రిన్సిపాల్‌తో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థి మృతిపట్ల ఆమె విచారం వ్యక్తం చేశారని సమాచారం. అలాగే సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు, కళాశాలల నిర్వహణ, పెండింగ్ బిల్లుల వంటి అంశాలపై ఆమె ఉమ్మడి కరీంనగర్ జిల్లాల ప్రిన్సిపాళ్లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిసింది. పాఠశాలల్లో ఉపాధ్యాయుల విధివిధానాలు, హాజరు, విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ, వసతి సౌకర్యాలు, మెనూ ప్రకారం భోజనం వంటి వాటిపై చర్చించినట్లు సమాచారం. హుస్నాబాద్‌లో జరిగిన సంఘటన పునరావృతం కాకుండా పటిష్ట బాధ్యతతో వ్యవహరించాలని సూచించినట్లు తెలిసింది.

దొంగతనం కేసులో ఒకరి అరెస్టు

● 4 తులాల బంగారు పుస్తెలతాడు స్వాధీనం

దుబ్బాక, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): అక్బర్‌పేట-భూంపల్లి మండలం పోతారెడ్డిపేట గ్రామంలో గత రెండు రోజుల క్రితం మహిళపై దాడి చేసి నాలుగు తులాల బంగారు పుస్తెల తాడు అపహరించిన సంఘటనలో గురువారం నిందితుడిని అరెస్టు చేసి, రిమాండ్‌కు పంపినట్లు దుబ్బాక సీఐ పాలెపు శ్రీనివాస్ తెలిపారు. దుబ్బాక సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. పోతారెడ్డిపేట గ్రామానికి చెందిన జూకంటి మల్లారెడ్డి గ్రామంలోని కంకణాల రాజమణి(75)ని నమ్మించి ఇంట్లో చొరబడ్డాడు. అనంతరం అక్కడే తక్కెడ బరువుతో రాజమణిని గాయపరిచి ఆమె మెడలో ఉన్న నాలుగు తులాల పుస్తెల తాడును అపహరించాడు. బాధితురాలి భర్త కంకణాల శంకరయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడి కోసం గాలించి, గురువారం ఉదయం పోతారెడ్డిపేట శివారులో అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద దాడికి ఉపయోగించిన తక్కెడ బరువుతో పాటు నాలుగు తులాల పుస్తెల తాడును స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై హత్యాయత్నం, దొంగతనం కేసు నమోదు చేసి జ్యుడీషియల్ కస్టడీకి తరలించినట్లు సీఐ శ్రీనివాస్ తెలిపారు. ఈ సమావేశంలో సీఐతో పాటు సిబ్బంది రాంజీ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు మధ్యలో కుంగిన పైప్‌లైన్

● ప్రమాదానికి ఆస్కారం


రోడ్డుపై కుంగిన పైప్‌లైన్

మనోహరాబాద్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మనోహరాబాద్ మండలం జాతీయ రహదారి పక్కనే దండుపల్లి నుంచి వర్గల్ మండలం వరకు రెండు లేన్ల రోడ్డుపై ఉన్న పైప్‌లైన్ కుంగింది. ఈ రోడ్డుకు రెండు వైపులా దండుపల్లి గ్రామ పెద్ద చెరువు నీరు నిండి ఉంది. ఈ నేపథ్యంలో రోడ్డు కింద భాగంలో నీటి కోసం పైపులను ఏర్పాటు చేశారు. పైప్‌లైన్ పగిలిపోవడంతో రోడ్డు పూర్తిగా కుంగిపోయింది. దీంతో రోడ్డు మధ్యలో తెగిపోయే ప్రమాదం ఉండడంతో ప్రయాణికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదం జరగముందే ఆర్ అండ్ బీ అధికారులు రోడ్డు బాగుచేయాలని కోరుతున్నారు.

న్యూస్ బాక్స్

నేడు చేగుంటలో విద్యుత్ అంతరాయం

చేగుంట, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషనలో మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 12 నుంచి సాయంత్రం 4 గంటల వరకు మండల పరిధిలోని పలు ఫీడర్లలో విద్యుత్ అంతరాయం ఉంటుందని రామాయంపేట ఏడీ ఆదయ్య తెలిపారు. మండలంలోని చేగుంట, అనంత సాగర్, గొల్లపల్లి, కర్నాల్‌పల్లి, చందాయిపేట్, కసాన్పల్లి ,ఆర్‌ఎస్‌జీ, ఫైనిర్ డెక్కన్, వి చంద్రాంచల్‌లలో 33 కేవీ సబ్ స్టేషన్‌లో ఫీడర్‌లో విద్యుత్ సరఫరా అంతరాయం ఏర్పడుతుందన్నారు.

బోధనతో ఆసక్తి పెంచాలి

పటాన్‌చెరు అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): తరగతుల్లో జరుగుతున్న బోధన విద్యార్థుల్లో ఆసక్తి పెంచేటట్లు ఉండాలని జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు సూచించారు. గురువారం తెల్లాపూర్ పురపాలక పరిధి ఘన్‌పూర్ పాఠశాలను ఆయన సందర్శించారు. తరగతి గదుల్లో బోధనను ప్రత్యక్షంగా పరిశీలన చేశారు.

విద్యార్థులు సేవాభావాన్ని అలవర్చుకోవాలి

హవేళిఘణపూర్, అక్టోబరు 9, (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సామాజిక సేవాభావాన్ని అలవర్చుకోవాలని మెదక్ జిల్లా ఏఎస్పీ మహేందర్ తెలిపారు. గురువారం మండలంలోని కూచన్‌పల్లిలో మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించడం వల్ల నాయకత్వ లక్షణాలు అలవడతాయన్నారు.

పెండింగ్ వేతనాలు ఇప్పించాలి

మనూరు, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పని చేస్తున్న అతిథి అధ్యాపకులు చాలీచాలని వేతనాలతో ఇబ్బందులు పడుతున్నారని అతిథి అధ్యాపకులు విఠల్, రాములు, అనిల్, జుబేర్ పేర్కొన్నారు. మొత్తం 9 నెలలుగా వేతనాలు తమకు రావాల్సి ఉందన్నారు. తమ సమస్యను పరిష్కరించవల్సిందిగా మనూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.లక్ష్మీప్రసన్నకు గురువారం వినతి పత్రం సమర్పించారు.

బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ బకాయిలు చెల్లించాలి

సంగారెడ్డి అర్బన్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి) : బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ బకాయిలు వెంటనే చెల్లించాలని తెలంగాణ స్టూడెంట్స్ వాయిస్ రాష్ట్ర అధ్యక్షుడు బంగారు కృష్ణ డిమాండ్ చేశారు. గురువారం సంగారెడ్డి కలెక్టరేట్‌లో ఇన్‌చార్జి ఏవో విజయలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత రెండేళ్ల నుంచి బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ బకాయిలు చెల్లించకపోవడంతో యాజమాన్యాలు పాఠశాలలు మూసివేసే పరిస్థితికి వచ్చాయన్నారు. బెస్ట్ అవైలబుల్ స్కీమ్ కింద ఎంతో మంది ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు విద్యనభ్యసిస్తూ లబ్ధి పొందుతున్నారని, అందువల్ల ప్రభుత్వం వెంటనే బకాయిలు చెల్లించాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సాయి కుమార్, భానుప్రసాద్ ఉన్నారు.

బీజేపీ నుంచి బీఫాం ఇస్తే జెడ్పీటీసీగా పోటీకి సిద్ధం



లింగాగౌడ్

చిన్నశంకరంపేట, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): చిన్నశంకరంపేట మండలం నుంచి బీజేపీ బీ ఫాం ఇస్తే జెడ్పీటీసీగా పోటీ చేసేందుకు తాను సిద్ధంగా ఉన్నట్లు గుడికాడి లింగాగౌడ్ స్పష్టం చేశారు. గురువారం ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు ఎంతో ఉపయోగపడుతున్నాయని స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ విజయం సాధిస్తుందని దీమా వ్యక్తం చేశారు. బీజేపీ గెలుపు కోసం కృషి చేస్తామన్నారు.

రేపటి నుంచి ఇర్ఫానీ దర్గా ఉర్సు

సంగారెడ్డి రూరల్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి మండలం కులబ్‌గూర్‌లో ఈ నెల 11వ తేదీ నుంచి రెండు రోజులపాటు ఉర్సు నిర్వహించనున్నట్లు దర్గా నిర్వాహకులు హజ్రత్ హకీమ్ ఒమర్ బిన్ అహ్మద్ సజ్జద్‌యే నషీన్ బార ఇర్ఫానీ తెలిపారు. కలబ్‌గూర గ్రామ శివారులోని హజ్రత్ మౌలానా అల్ హాజ్ హబీబ్ అహ్మద్ బిన్ ఒమర్ అల్ మారుఫ్ హబీబ్ ఇర్ఫానీ అలీ షా బందనవాజ్(ఇర్ఫానీ) 23వ ఉర్సులో భాగంగా ఈ నెల 11, 12 తేదీల్లో రెండు రోజుల పాటు వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా పట్టణంలోని జామిమా మసీదు నుంచి మొదటి రోజు గంధం ఊరేగింపు, రాత్రి గంధారాధన, 12న సాయంత్రం దీపారాధన, ఖవ్వాలి, అన్నదాన కార్యక్రమాలు ఉంటాయని వెల్లడించారు.

రైతులు మధ్యదళారులను ఆశ్రయించొద్దు

చేగుంట అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 17 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శివప్రసాద్ మాట్లాడుతూ చేగుంట మండలంలో గురువారం ఏడు కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్లు తెలిపారు. రైతులు మధ్య దళారులను ఆశ్రయించకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం అమ్ముకోవాలని కోరారు.

నామినేషన్ కౌంటర్ల పరిశీలన



జహీరాబాద్: నామినేషన్లు తీసుకునే కౌంటర్ వద్ద ఎన్నికల సిబ్బందితో మాట్లాడుతున్న సంగారెడ్డి జడ్పీ సీఈవో జానకిరెడ్డి



నారాయణఖేడ్‌లోని ఎంపీడీవో కార్యాలయంలో ఎన్నికల ఏర్పాట్లను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ ఉమా హారతి



మనూరు: ఎన్నికల బందోబస్తును పరిశీలిస్తున్న నారాయణఖేడ్ సీఐ శ్రీనివాస్‌రెడ్డి



నిజాంపేటలో నామినేషన్ కౌంటర్‌ను పరిశీలించిన మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ నగేష్, ఎన్నికల పరిశీలనాధికారి ఆసం వెంకటేశ్వర్లు

సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లోని ఆయా మండలాల్లో గురువారం ఉన్నతాధికారులు ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించారు. అభ్యర్థుల నుంచి నామినేషన్ల స్వీకరణ కోసం ఏర్పాటు చేసిన కౌంటర్లను, హెల్ప్ డెస్క్‌లను పరిశీలిస్తూ సంబంధిత ఎన్నికల సిబ్బందికి అవసరమైన సూచనలు చేశారు. నామినేషన్లు తిరస్కరణకు గురికాకుండా ఉండేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎన్నికల అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఆయా సెంటర్ల వద్ద పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

\- న్యూస్ నెట్‌వర్క్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి)



టేక్మాల్ ఎంపీడీవో కార్యాలయంలో నామినేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న మెదక్ ఆర్డీవో రమాదేవి

ధార్మిక చింతనతో మానసిక ప్రశాంతత



కొప్పోల్ ఉమా సంగమేశ్వర స్వామి ఆలయంలో మాట్లాడుతున్న మాధవానంద సరస్వతీ స్వామి

పెద్దశంకరంపేట, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని రంగంపేట పీఠాధిపతి శ్రీమాధవానంద సరస్వతీ స్వామి పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని కొప్పోల్ ఉమాసంగమేశ్వరస్వామి వారి ఆలయంలో మాధవానంద సరస్వతీస్వామి వారి 15వ వార్షిక ఆరాధన కార్యక్రమంలో ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రంగంపేట పీఠాధిపతి మాధవానంద సరస్వతీ స్వామి వారు భక్తులను ఉద్దేశించి అనుగ్రహ భాషణం చేశారు. కార్యక్రమంలో నాచారం పీఠాధిపతి మధుసూదనానంద సరస్వతీస్వామి, వేద పండితులు గుడి చంద్రశేఖర్, నరహరిశర్మ, దిగంబర్ శర్మ, సోమశేఖర్ శర్మ, సాయిగురు, రాఘవేంద్రచారి, గుడి సంతోష్‌కుమార్, రమేష్ శర్మ, ఆంజనేయ శర్మ, ఆలయ పూజారి సంగప్ప పాల్గొన్నారు.

టపాసుల దుకాణాల్లో జాగ్రత్తలు పాటించాలి

నారాయణఖేడ్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): టపాసుల దుకాణాల్లో అన్ని రకాల జాగ్రత్తలను పాటించాలని మున్సిపల్ కమిషనర్, డీఎస్పీ వెంకట్‌రెడ్డి, అగ్నిమాపక కేంద్రం అధికారి శ్రీధర్ సూచించారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో ఖేడ్‌లో దీపావళి సందర్భంగా ఏర్పాటు చేయనున్న టపాయల దుకాణదారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దుకాణాలకు అనుమతులు తీసుకోవాలన్నారు. డ్రమ్ముల్లో ఇసుక, నీళ్లు, అందుబాటులో ఉంచాలన్నారు. అవసరమైన అన్ని జాగ్రత్తలను గురించి వివరిస్తూ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ హసీనాబేగం, సీఐ శ్రీనివాస్‌రెడ్డి, పాల్గొన్నారు.

రిజర్వేషన్ల పేరిట బీసీలను వంచించిన కాంగ్రెస్

మనోహరాబాద్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): బీసీల రిజర్వేషన్ పేరిట కాంగ్రెస్ పార్టీ నాటకమాడుతున్నదని బీఆర్‌ఎస్ మెదక్ జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ ర్యాకల హేమలత విమర్శించారు. గురువారం రిజర్వేషన్ల విషయంలో కోర్టు స్టే విధించడంతో జెడ్పీ చైర్‌పర్సన్ తన నివాసంతో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌ను ఎన్నికల్లో కల్పిస్తామని రోజుకో మాట చెబుతూ బీసీలను కాంగ్రెస్‌పార్టీ మోసం చేస్తున్నదన్నారు. బీసీ రిజర్వేషన్ పేరుతో ఎన్నికలు పెట్టలేక గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. నోటిఫికేషన్ వెలువడిన రోజే కోర్టు స్టే విధించడం కాంగ్రెస్ పార్టీకి ముందే తెలుసన్నారు. కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి ఉంటే బీసీలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలంటే వెంటనే ఎన్నికలు నిర్వహించాలన్నారు.

బీసీలను వంచించిన కాంగ్రెస్

టేక్మాల్ అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): రిజర్వేషన్ల పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను వంచించిందని టేక్మాల్ మండల బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు భక్తుల వీరప్ప పేర్కొన్నారు. గురువారం టేక్మాల్ చౌరస్తాలో బీఆర్‌స్ శ్రేణులతో కలిసి ప్రభుత్వ దిష్టి బొమ్మను దహనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..రాజకీయ లబ్ధికోసం బీసీల వైపు నేనున్నానంటూ సీఎం రేవంత్‌రెడ్డి ఒక వైపు చెబుతూ మరోవైపు బీసీల పట్ల నయవంచన చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలోనే కాంగ్రెస్ ప్రభుత్వానికి రాష్ట్ర ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. కార్యక్రమంలో యశ్వంత్‌రెడ్డి, సలీం, రమేష్‌నాయక్ యసిద్దయ్య, భాస్కర్, రవి, మహేందర్, పోలు, నాయకులు ఉన్నారు.



టేక్మాల్ చౌరస్తాలో కాంగ్రెస్ ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిక



మాజీ ఎమ్మెల్యే హనుమంతరావు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన మాజీ ఏఎంసీ చైర్మన్ రమణ, కార్యకర్తలు

చిన్నశంకరంపేట, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలోకి భారీగా వలసలు పెరిగాయని రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు పేర్కొన్నారు. గురువారం చిన్నశంకరంపేట మండలం మిర్జాపల్లి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్, మాజీ జడ్పీటీసీ పోతరాజు రమణతో పాటు మాజీ ఎంపీటీసీ అంజాగౌడ్, పలు మండలాలకు చెందిన 500 మంది బీఆర్‌ఎస్ కార్యకర్తలు మాజీ ఎమ్మెల్యే హనుమంతరావు, డీసీసీ అధ్యక్షుడు అంజనేయులు గౌడ్, సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా హనుమంతరావు మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పార్టీలో కార్యకర్తలకు స్వేచ్ఛ లేదని, వారిని పట్టించుకునే వారు లేకపోవడంతో కాంగ్రెస్ వైపు మొగ్గు చూపుతున్నారని పేర్కొన్నారు. ప్రతీ కార్యకర్తకు కాంగ్రెస్ అండగా ఉంటుందన్నారు. అనంతరం రమణ మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి మరింత కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యడు సాన సత్యనారాయణ, పలు గ్రామాలకు చెందిన కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజకీయాల్లో బెదిరింపులు సరికాదు



మాట్లాడుతున్న కాంగ్రెస్ జిల్లానాయకుడు చిట్టిబాబు

జోగిపేట, అక్టోబరు9(ఆంధ్రజ్యోతి): రాజకీయాల్లో విమర్శలు, ప్రతి విమర్శలు సహజమే అయినప్పటికీ, అందులో హుందాతనం ఉండాలి తప్ప బెదిరింపులకు పాల్పడడం సరికాదని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు ఏ. చిట్టిబాబు పేర్కొన్నారు. గురువారం ఆయన జోగిపేటలోని తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. అలయ్‌బలయ్ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి హరీశ్‌రావు హుందాగా విమర్శించి ఉండాల్సింది తప్ప, పింక్ బుక్కంటూ బెదిరించడం ఆయన స్థాయికి సరికాదన్నారు. రేవంత్ నేతృత్వంలోని కాంగ్రెస్ పాలనలో, దామోదర రాజనర్సింహ ప్రాతినిధ్యం వహిస్తున్న అందోలు నియోజకవర్గంలో పోలీస్ (ఖాకీ) రూల్సే తప్ప.. పింకు, రెడ్ బుక్కులు నడవవని వ్యాఖ్యానించారు. డీసీసీబీ మాజీ ఉపాధ్యక్షుడిగా, అందోలు రాజకీయాల్లో సీనియర్ నాయకుడుగా పనిచేస్తున్న జైపాల్‌రెడ్డి సైతం... ఖబడ్దార్ అంటూ బెదిరింపులకు పాల్పడడం ఆయన విజ్ఞతకే వదిలివేస్తున్నామన్నారు. ఒకవేళ మీరు మళ్లీ అలాంటి పదాలే వాడితే, మేము కూడా అలాగే స్పందిస్తామని అన్నారు. సమావేశంలో ఆత్మ కమిటీ డైరెక్టర్లు తుడుం యాదయ్య, చిట్యాల మధు, ఖాలిద్, నాయకులు చోటూ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్ల ప్రక్రియ సక్రమంగా నిర్వహించాలి: ఆర్డీవో



తూప్రాన్‌లో డివిజన్ పరిధి అధికారుల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్డీవో జయచంద్రారెడ్డి

తూప్రాన్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): నామినేషన్ల ప్రక్రియ సక్రమంగా నిర్వహించాలని తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి సూచించారు. గురువారం తూప్రాన్ మున్సిపల్ కార్యాలయంలో తూప్రాన్ డివిజన్ పరిధి 6 మండలాల అధికారులకు ఎన్నికల నామినేషన్లపై రిటర్నింగ్ అధికారులు, సహాయ అధికారులు, పోలింగ్ సిబ్బందికి శిక్షణ అందజేశారు. శిక్షణలో నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, ఉపసంహరణ, తుది జాబితా ప్రకటించడం, పోలింగ్ నిర్వహణ, ఓట్ల లెక్కింపు వంటి అన్ని దశలపై అధికారులకు సమగ్ర అవగాహన కల్పించారు. అభ్యర్థులు సమర్పించాల్సిన పత్రాలు, ఫీజు, అర్హత ప్రమాణాలు, సమర్పణకు గడువు, నిబంధనలు స్పష్టంగా తెలియజేశారు. ఎన్నికల నిబంధనల ఉల్లంఘనపై తీసుకునే చర్యలు, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలు, ఎన్నికల సమయంలో శాంతి భద్రతల నిర్వహణ వంటి అంశాలపై అధికారులకు మార్గదర్శకాలు అందజేశారు. శిక్షణలో తహసీల్దార్లు, ఎంపీడీవోలు, పంచాయతీ రాజ్ అధికారులు, రిటర్నింగ్ ఆఫీసర్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

'చలో బస్‌భవన్'ను అడ్డుకోవడం అన్యాయం



కొల్లూరు పోలీస్‌స్టేషన్‌లో తెల్లాపూర్ బీఆర్‌ఎస్ నాయకులు

రామచంద్రాపురం టౌన్ అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): సామాన్యుడిపై భారం పడే విధంగా ఆర్టీసీ చార్జీలు పెంచడం అన్యాయమని తెల్లాపూర్ మాజీ సర్పంచ్, రాష్ట్ర సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు మల్లేపల్లి సోమిరెడ్డి పేర్కొన్నారు. అధిష్టానం పిలుపు మేరకు గురువారం చలో బస్‌భవన్ ముట్టడికి వెళ్లనివ్వకుండా కొల్లూరు పోలీసులు బీఆర్‌ఎస్ శ్రేణులను అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాన్యులకు దన్నుగా నిలబడటానికి చేస్తున్న పోరాటాన్ని అణగదొక్కుతున్నారని విమర్శించారు. దీనిపై తాము పెద్దఎత్తున ఉద్యమిస్తామన్నారు. అరెస్టయినవారిలో బీఆర్‌ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు దేవేందర్‌యాదవ్, లచ్చిరామ్, బాబ్జీ, నాగరాజు, జ్యోతిశ్రీకాంత్‌రెడ్డి, టెలికాం బోర్డు సభ్యుడు దయాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు. అదేవిధంగా రామచంద్రాపురంలోని బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆదర్శరెడ్డిని ఆయన నివాసంలోనే పోటీసులు గృహనిర్బంధం చేశారు. ఉదయం బయటకు వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారు. మద్దతుగా వచ్చిన వారిని సైతం అక్కడే నిర్బంధించారు.

పద్మాదేవేందర్‌రెడ్డి గృహనిర్బంధం



కొంపల్లిలోని నివాసంలో పోలీసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

మెదక్ మున్సిపాలిటీ, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ చార్జీల పెంపు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలన్న డిమాండ్ చేస్తూ చలో బస్‌భవన్ కార్యక్రమాన్ని పోలీసులు అడ్డుకున్నారు. గురువారం బీఆర్‌ఎస్ పార్టీ పిలుపు మేరకు చేపట్టే ఆందోళన కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు కొంపల్లిలోని మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి నివాసంలో పోలీసులు ఆమెను గృహనిర్బంధం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గత పదేళ్లలో కేసీఆర్ ప్రభుత్వం చార్జీలు పెంచలేదని గుర్తు చేశారు. ఉచిత బస్సు పేరు చెప్పుతూ.. మరోవైపు సామాన్యులపై భారం విధించేలా పెంచడమేంటని ప్రభుత్వంపై మండిపడ్డారు. ఇలాంటి పోలీస్ నిర్బంధాలు తమకేమి కొత్త కాదన్నారు.

మాజీ కౌన్సిలర్ అయితారం నర్సింహులు మృతి

మాజీ కౌన్సిలర్ అయితారం నర్సింలు అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయాన్ని తెలుసుకున్న పద్మాదేవేందర్‌రెడ్డి గురువారం జరిగిన అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ఆమెతో పాటు మున్సిపల్ మాజీ చైర్మన్ ఆరేళ్ల మల్లికార్జున్‌గౌడ్, నాయకులు శేఖర్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలి



పిల్లలతో మాట్లాడుతున్న న్యాయాధికారి సౌజన్య

సంగారెడ్డి క్రైం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నతంగా ఎదగాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.సౌజన్య సూచించారు. సంగారెడ్డిలోని బాల సదనాన్ని గురువారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలన్నారు. పిల్లలకు అన్ని చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. ఉపాధ్యాయులకు న్యాయపరమైన విషయాల్లో సహాయం అవసరమైతే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో సంప్రదించాలని ఆమె కోరారు.

పటాన్‌చెరు పరిశ్రమలకు తాగునీరేది



జలమండలి ఎండీకి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామికవాడకు తాగునీటిని అందించే విధంగా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి కోరారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లోని జలమండలి ఎండీ అశోక్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పటాన్‌చెరు పారిశ్రామికవాడకు తాగునీరు అందించకపోవడం వల్ల కార్మికులు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అలాగే తెల్లాపూర్ పురపాలక పరిధి ఉస్మాన్ నగర్‌లోని బీమ్యాక్‌కాలనీ వాసులనుంచి వసూలు చేస్తున్న చార్జీలు తగ్గించాలని కోరారు.కార్యక్రమంలో రామచంద్రాపురం ఎంపీపీ యాదగిరియాదవ్, బిలా ప్రతినిధులు సుధీర్‌రెడ్డి, శ్రీనివాస్, నర్సింహ, ఉమేష్ తదితరులు ఉన్నారు.

క్రీడలకు పెరుగుతున్న ప్రాధాన్యత

నియోజకవర్గంలో క్రీడలకు ప్రాధాన్యత కల్పిస్తున్నామని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం బీరంగూడ పాఠశాలలో పదవతరగతి చదువుతున్న ఉమ, అశ్వనిలు కిక్ బాక్సింగ్ విభాగంలో మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో బంగారుపతకాన్ని సాధించారు. కాశ్మీర్‌లో జరగనున్న జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. 8వ తరగతి చదువుతున్న రుత్విక్‌రెడ్డి సంగారెడ్డి జిల్లాస్థాయిలో జరిగిన షటిల్ బ్యాడ్మింటన్ పోటీలో బంగారుపతకం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఎమ్మెల్యే ఆ విద్యార్థులను అభినందించారు.

వీధి వ్యాపారులకు రుణాలు ఇప్పించాలి: మెప్మా పీడీ

తూప్రాన్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): గుర్తించిన వీధి వ్యాపారులకు లోక్ కల్యాణ్ మేళా పథకంలో బ్యాంకులు రుణాలు ఇప్పించాలని మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ హనుమంతరెడ్డి పేర్కొన్నారు. గురువారం తూప్రాన్ మున్సిపల్ కార్యాలయంలో రిసోర్స్ పర్సన్‌ల సమావేశం నిర్వహించారు. వీధి వ్యాపారులకు పీఎం స్వనిధి పథకం కింద మొదటి దఫా రూ. 15వేలు రుణం, సక్రమంగా చెల్లింపులు చేసిన వీధి వ్యాపారులకు రూ. 25వేల రుణం, మూడో దఫా రూ. 25వేల రుణం ఇప్పించాలని పీడీ హనుమంతరెడ్డి పేర్కొన్నారు. వీధి వ్యాపారులకు అందజేసిన పీఎంస్వనిధి స్కీమ్ రుణాలు సక్రమంగాచెల్లించేలా చూడాలన్నారు.

ఉపాధ్యాయులకు అండగా పీఆర్టీయూ: ఎమ్మెల్సీ

నర్సాపూర్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యల సాధనతో పాటు వారికి అండగా పీఆర్టీయూ నిలుస్తుందని ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం నర్సాపూర్‌లో ఈ మధ్య గుండెపోటుతో చనిపోయిన ప్రధానోపాధ్యాయుడు, పీఆర్టీయూ ముఖ్యనాయకుడు లక్ష్మీనారాయణ కుటుంబాన్ని ఎమ్మెల్సీ కలిసి పరామర్శించారు. అదేవిధంగా పీఆర్టీయూ క్రియాశీల సభ్యుడిగా ఉన్నందున లక్ష్మీనారాయణ కుటుంబానికి సంఘం నుంచి రూ. లక్ష ఆర్థిక సహాయాన్ని ఎమ్మెల్సీ అందజేశారు. కార్యక్రమంలో మెదక్ జిల్లా సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి సామ్యానాయక్, రాష్ట్ర నాయకురాలు స్వరూపరాణి, అసోసియేట్ అధ్యక్షులు మల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సదరన్ ఇండియా సైన్స్ డ్రామా ఫెస్టివల్‌లో రాష్ట్రస్థాయికి విద్యార్థుల ఎంపిక



బహుమతులు సాధించిన త్రివేణి విద్యార్థులు

పటాన్‌చెరు రూరల్, అక్టోబర్ 9(ఆంధ్రజ్యోతి): జిల్లా సైన్స్ కేంద్రం ఆధ్వర్యంలో సంగారెడ్డిలో జరిగిన జిల్లాస్థాయి ఇండియా సైన్స్ డ్రామా పోటీల్లో ముత్తంగి త్రివేణి విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. వీరు ప్రదర్శించిన డిజిటల్ ఇండియా, జీవితాలను శక్తివంతం చేయటం అనే ప్రదర్శనతో ప్రథమ బహుమతి సాధించి జిల్లాస్థాయి నుంచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. వారికి జిల్లా సైన్స్ అధికారి సిద్ధారెడ్డి సర్టిఫికెట్లు, మెమొంటో అందజేసి అభినందనలు తెలియజేశారు. విద్యార్థులు సాజియా, ఆకాష్, భవాని, ప్రణీత, దివ్య, రాజు, నవీన, ప్రదయ్య, నందకిషోర్ నిత్యలతో పాటు గైడ్ టీచర్ హరీష బహుమతులు అందుకున్న వారిలో ఉన్నారు. బహుమతులు సాధించిన వారిని స్కూల్స్ సీఈఓ సాయి నరసింహారావు స్కూల్ ప్రిన్సిపాల్ మాలిని, ఇన్‌చార్జి గోవర్ధన్, ఉపాధ్యాయులు అభినందనలు తెలియజేశారు.

ఖేడ్‌లో ఘనంగా చెగువేరా 58వ వర్ధంతి

నారాయణఖేడ్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): ఖేడ్‌లోని ఓ ప్రైవేటు కళాశాలలో గురువారం ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ప్రపంచ విప్లవ కారుడు చెగువేరా 58వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి సంఘం నాయకులు, విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సతీష్ మాట్లాడుతూ చెగువేరా స్ఫూర్తితో సమానత్వం, న్యాయం, మానవ హక్కులు సమాజ మార్పు కోసం ప్రభుత్వాలపై పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

జహీరాబాద్, అక్టోబరు9 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లోఉన్న వేతనాలు చెల్లించాలని కోరుతూ గురువారం మున్సిపల్‌కార్మికులు ఆర్డీవో కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు మైపాల్, పలువురు మున్సిపల్ కార్మికులు మాట్లాడుతూ వేతనాలుచెల్లించక పోవడంతో తాము పస్తులుండాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. అనంతరం ఆర్డీవో కార్యాలయ అధికారికి వారు వినతిపత్రం అందజేశారు.

అక్రమ నిర్మాణాలకు నోటీసులతో సరి!

కంది, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రానికి ఆనుకుని ఉన్న మేజర్ గ్రామ పంచాయతీ కంది అక్రమ నిర్మాణాలకు అడ్డాగా మారింది. నిత్యం పుట్టగొడుగుల్లా అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నా పంచాయతీ అధికారులు తమకేం పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. అక్రమ నిర్మాణాలు పూర్తయిన తర్వాత వాటికి తూతూమంత్రంగా నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకుంటున్నారు. గురువారం కందిలోని జాతీయ రహదారి పక్కనే ఓ టిఫిన్ సెంటర్, కార్ వాష్ షెడ్డుకోసం పంచాయతీ నుంచి ఎలాంటి అనుమతులు పొందకుండా అక్రమ నిర్మాణాన్ని పూర్తి చేశారు. స్థానికులు పంచాయతీలో ఫిర్యాదు చేస్తే పంచాయతీ కార్యదర్శి కవిత సిబ్బందితో కలిసి వెళ్లి ఆ అక్రమ నిర్మాణాలకు నోటీసులు ఇచ్చి మమ అనిపించారు. అయితే అక్కడ జరుగుతున్న పనులు మాత్రం అడ్డుకోకపోవడం గమనార్హం. ఉన్నతాధికారులు దృష్టి సారించాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.